

రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు

రాష్ట్రస్థాయి ఆరో యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు పెంటపాడు మండలం ప్రత్తిపాడులో ప్రారంభమయ్యాయి.

10లో ▸



నారసింహుని శాంతి కల్యాణం

ఐఎస్ జగన్నాథపురంలో సుందరగిరిపై లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో దివ్య పవిత్రోత్సవాల్లో భాగంగా శాంతి కల్యాణం జరిపించారు.

10లో ▸



అడవిలో అన్నీ ఔషధాలే

అడవిలో చెట్లు ఆహ్లాదాన్ని పంచడంతో పాటు వ్యాధులను నయం చేస్తాయని ఆయుర్వేద వైద్యులు పేర్కొంటున్నారు.

10లో ▸

పీఓపీ విగ్రహాలతో చేటు

మట్టి ప్రతిమలే మేలు

- ఏటా 90 శాతానికి పైగా పీఓపీ విగ్రహాల ఏర్పాటు
- 5 నుంచి 30 అడుగుల వరకు ప్రతిమలు
- జిల్లాలో సుమారు 10 వేల విగ్రహాలు
- వీటి నిమజ్జనంతో జల కాలుష్యం
- అధికారుల చర్యలు శూన్యం
- మట్టి విగ్రహాలను పూజించాలంటున్న పర్యావరణ వేత్తలు



ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో గణపతి విగ్రహాలు తయారు చేస్తున్న కార్మికులు

భీమవరం(ప్రకాశం చౌక్): వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాటుచేసే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు పొంచి ఉంది. ఏటా వీటిని కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేయడం జల కాలుష్యానికి కారణమవుతోంది. పీఓపీ విగ్రహాలపై నిషేధం ఉన్నా ఏటా వేలల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అయినా కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఏటా జిల్లాలో 2 నుంచి 30 అడుగుల వరకు పీఓపీ విగ్రహాలను సుమారు 10 వేల వరకూ ఏర్పాట్లు చేస్తున్నట్టు అంచనా.

జలచరాలకు హాని.. ప్రమాదకరమైన రంగులు, నీటిలో కరగని పదార్థాలతో పీఓపీ విగ్రహాలను తయారుచేస్తున్నారు. అయితే వీటిని నిమజ్జనం చేసిన సమయంలో 70 శాతం వరకు మాత్రమే నీటిలో కరిగి మిగిలిన రంగులు, పదార్థాలు కరగకపోవడం జలకాలుష్యానికి కారణమవుతోంది. అలాగే కాలువలు, గోదావరిలో జీవించే జలచరాలకు ముప్పు వాటిల్లుతోంది.

ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు

జిల్లాలో 90 శాతం పీఓపీ విగ్రహాలను ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులు తయారు చేసి విక్రయిస్తున్నారు. వినాయకచవితికి రెండు, మూడు నెలల ముందే కుటుంబంతో సహా ఇక్కడకు వచ్చి తాత్కాలికంగా గుడారాలు ఏర్పాటు చేసుకుని వీటిని తయారుచేస్తున్నారు. ఇలా జిల్లాలో 50 వరకు కుటుంబాలు పీఓపీ విగ్రహాలను తయారుచేస్తున్నాయి. అయితే పీఓపీ విగ్రహాలను తయారు చేసే కార్మికుల ఆరోగ్యం కూడా దెబ్బతింటోంది. విగ్రహాలను తయారుచేసే సమయంలో రంగులను పీల్చడం ద్వారా ఊపిరితిత్తులు దెబ్బతినడం, క్యాన్సర్, చర్మవ్యాధులు, నేత్ర సమస్యలతో బాధపడుతున్నారు.

జిల్లాలో జోరుగా విక్రయాలు

జిల్లాలో అత్తిలి, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, పెనుగొండ, నరసాపురం, మొగల్తూరు, చించినాడ తదితర ప్రాంతాల్లో పీఓపీ విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. ఏటా జిల్లాలోని 409 పంచాయతీలు, ఆరు మున్సిపాలిటీల్లో సుమారు 10 వేల వరకూ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తుంటారు. వీటిలో 90 శాతం వరకూ పీఓపీ విగ్రహాలే ఉంటున్నాయి. వీటి ధరలు రూ.2 వేల నుంచి రూ.25 వేల వరకు ఉన్నాయి.

మట్టి విగ్రహాలే మేలు

పీఓపీ విగ్రహాల ఏర్పాటు విషయంలో ఉత్సవ కమిటీ నిర్వాహకుల ఆలోచనల మారాలని, మట్టి విగ్రహాలను ఏర్పాటుచేసి నవరాత్రుల్లో పూజించాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు. పీఓపీ విగ్రహాలపై అందరూ అవగాహన పెంచుకుని పర్యావరణానికి మేలు చేయాలని అంటున్నారు.

ఆరోగ్యానికి ముప్పు



ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) నీటిలో కలిసినప్పుడు జిప్సంగా మారుతుంది. ఇది నీటిలో ఆక్సిజన్ స్థాయిలను తగ్గించి, జలచరాలకు హాని చేస్తుంది. విగ్రహాలను విషపూరిత రసాయనాలు, రంగులు, భారీ లోహాలతో (లెడ్, మెర్క్యూరీ, సీసం, పాదరసం) తయారు చేస్తారు. ఇవి నీటిని కలుషితం చేసి, పర్యావరణ వ్యవస్థను దెబ్బతీస్తాయి. అలాగే ఇవి మానవ ఆరోగ్యానికి కూడా హాని కలిగిస్తాయి. వీటిని నిమజ్జనం చేసినప్పుడు నీటిలో కొన్ని లోహాలు కరగకుండా అలానే ఉండిపోతాయి. ఈ నీటిని తాగిన పశువులు, మనుషులకు క్యాన్సర్లు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. పీఓపీ విగ్రహాల బదులు మట్టి ప్రతిమలను ఏర్పాటు చేసుకోవడం పర్యావరణానికి శ్రేయస్కరం.

– డాక్టర్ పీఏఆర్‌కే రాజు, రిటైర్డ్ ప్రొఫెసర్, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, భీమవరం

ప్రకటనలకే పరిమితం.. చర్యలు శూన్యం

ఏటా జిల్లా ఉన్నతాధికారులు వినాయక చవితికి ముందు పీఓపీ విగ్రహాలు నిషేధం అంటూ ప్రకటనలు ఇవ్వడంతోనే సరిపెడుతున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి విగ్రహ తయారీదారులపై చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. అలాగే తయారీదారులకు, ఉత్సవ కమిటీలకు విగ్రహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం లేదు. కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు సమావేశాలకు హాజరవడం తప్ప ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఆక్వా రైతులను ఆదుకోవాలి



ఉండిలో ధర్నా చేస్తున్న రైతులు

ఉండి: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలతో ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ఆక్వా రైతులను ఆదుకోవాలని రాష్ట్ర వ్యవసాయ రైతు సంఘ మాజీ అధ్యక్షుడు బి.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఉండి ఏఎంసీ ప్రాంగణంలో రైతు సంఘ జిల్లా నాయకుడు జీను ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆక్వా రైతు జిల్లా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ సంఘ అధ్యక్షుడు వి.కృష్ణయ్య, కౌలు రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎ.హరిబాబు, జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ మాట్లాడుతూ దేశంలో ఆక్వా సాగు విస్తరించాలని పిలుపునిచ్చిన ప్రభుత్వాలు ఇప్పుడు ఆక్వా రైతు కష్టాల్లో ఉంటే ఎందుకు భరోసా ఇవ్వడం లేదన్నారు. రైతులను ఆదుకోకుంటే ఆక్వా రంగం మరింత కుదేలవుతుందన్నారు. రైతుల భాగస్వామ్యం లేకుండా అమరావతిలో అడ్వయిజరీ కమిటీని వేయడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఆక్వా రైతులను వెంటనే ఆదుకోకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చెరుకువాడ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు, నాయకులు ధనికొండ శ్రీనివాస్, మంగిన శ్రీహరి, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కోమటిలంకలో ఆర్డీఓ పర్యటన



వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఆర్డీఓ

సాక్షి స్పందన

దెందులూరు: 'కోమటిలంకకు రాకపోకలు బంద్' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి గురువారం కలెక్టర్ స్పందించారు. కోమటిలంకలో వరద పరిస్థితిని పరిశీలించేందుకు ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్ గ్రామంలో పర్యటించారు. వైద్యం శిబిరం ఏర్పాటుచేశారు. ఉద్యోగులు వరద తగ్గేవరకూ షిఫ్టుల ప్రకారం గ్రామంలో వెలుపల, బయట విధులు నిర్వహించాలని ఆదేశించారు. పడవలో పరిమితికి మించి ప్రయాణించకుండా చూడాలన్నారు. వరదపై తహసీల్దార్ జి.విజయ్‌కుమార్ రాజు, ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ఆర్ఐ అజయ్ ఉన్నారు.

23 నుంచి కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ఏలూరు టౌన్: తాత్కాలిక జాబితాలో ఎంపికైన సివిల్, ఏఆర్, ఏపీఎస్పీ పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావాలని జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్ తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఈనెల 23, 24 తేదీల్లో ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పరిశీలన ప్రక్రియ సాగుతుందని, ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడేసి చొప్పున జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ అధికారి సంతకం, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

అనుమతులు తప్పనిసరి

వినాయక చవితి ఉత్సవ కమిటీలు పోలీసుల అనుమతులు తప్పక తీసుకోవాలని, ఉత్సవాల పేరుతో ఇతరులకు ఇబ్బందులు కలిగించరాదని ఎస్పీ అన్నారు. కమిటీ నిర్వాహకులు నిబంధనలు తప్పక పాటించాలని ఆదేశించారు.

లీజు వాటాలు ఇప్పించాలి

ఏలూరు (టూటౌన్): మండవల్లి మండలం ఉనికిలిలో ఫీల్డ్ లేబర్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు అందరికీ సొసైటీ భూములకు సంబంధించిన లీజు వాటాలను ఇచ్చి న్యాయం చేయాలంటూ గ్రామానికి చెందిన ఎస్సీలు గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం డీఆర్వో విశ్వేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి సంబంధం లేనివారు సొసైటీలోని 76.14 ఎకరాలకు నకిలీ పట్టాలు సృష్టించి సొసైటీ భూమిని కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. దళితులకు ఈ సొసైటీనే జీవనాధారమని అన్నారు. దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొరబండి బాబూరావు, సొసైటీ అధ్యక్షుడు కొలిపే రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలి

ఏలూరు (టూటౌన్): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆదాయం కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఆదాయం చూపించి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని, వీరంతా రోడ్డున పడ్డారన్నారు. సంక్షేమ బోర్డు, డ్రైవర్లకు రూ.15 వేల సాయం, చంద్రన్న బీమా అమలు, జీఓ 21,31 రద్దు వంటి హామీలను కూటమి నాయకులు అమలు చేయాలని కోరారు.

పారదర్శకంగా డేటా సేకరణ

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించిన ఇండికేటర్స్ డేటా పారదర్శకంగా సేకరించి అప్‌లోడ్ చేస్తామని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చేనెల 1న అన్ని జిల్లాల్లో జిల్లా వాటర్ బులిటెన్లను విడుదల చేయాలని ఆయన ఆదేశించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25లోపు డేటా అప్‌లోడ్‌ను పూర్తిచేస్తామన్నారు.

మాజీ మంత్రి పేర్ని సందడి



టీ తాగుతున్న మాజీ మంత్రి పేర్ని నాని

నరసాపురం: నరసాపురంలో గురువారం మాజీ మంత్రి పేర్ని నాని సందడి చేశారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబును పరామర్శించడానికి మచిలీపట్నం నుంచి నరసాపురం మీదుగా గోదావరి పంటు దాటి కాకినాడ వెళ్లాలని భావించిన ఆయన ఇక్కడకు వచ్చారు. అయితే పంటు రాకపోకలు నిలిచిపోవడంతో చించినాడ మీదుగా ప్రయాణమయ్యారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఓ హోటల్‌లో టీ తాగి అక్కడున్న వారిని పలకరించారు.

అంగన్‌వాడీల నిరసన



ఆకివీడులో మానవహారం చేపట్టిన దృశ్యం

ఆకివీడు/భీమవరం: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. సీఐటీయూ నాయకులు బి.రాంబాబు మాట్లాడుతూ పాత ఫోన్లతో తీవ్ర ఇబ్బంది పడుతున్న అంగన్‌వాడీలకు కొత్త ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని, కొత్తగా ప్రభుత్వం తీసుకువచ్చిన ఫేస్ యాప్‌ను రద్దుచేయాలన్నారు. అంగన్‌వాడీ సంఘ నాయకురాలు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో..

భీమవరం: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి స్కేలు జీతం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. భీమవరంలో నిరసన ధర్నా చేపట్టారు. సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కనీస వేతనాలు అమలు చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని నినాదాలు చేశారు. అంగన్‌వాడీ సంఘ నాయకురాలు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల బదిలీలకు దరఖాస్తులు

ఏలూరు(ఆర్ఆర్‌పేట): జిల్లాలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అంతర్ జిల్లా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ ప్రకటనలో తెలిపారు. ఈనెల 24లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రింట్‌అవుట్‌లను 25 వరకు స్వీకరిస్తామన్నారు.

పోటెత్తిన వశిష్ట గోదావరి

- లంక గ్రామాల్లోకి నీరు
- ముంపులోనే కనకాయలంక కాజ్‌వే
- నరసాపురంలో పంటు రాకపోకలు నిలిపివేత



యలమంచిలి: కనకాయలంకలో పడవపై కాజ్‌వే దాటుతున్న ప్రజలు



యలమంచిలి: బోటుపై వెళుతున్న జేసీ



పెనుగొండ: సిద్ధాంతంలో లంక నుంచి వ్యవసాయ ఉత్పత్తులను గట్టుకు చేరుస్తూ..



నరసాపురం: రేవులో నిలిచిన పంటు

పెనుగొండ/యలమంచిలి/నరసాపురం: జిల్లాలో వశిష్ట గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. సిద్ధాంతం వద్ద కేదారీఘాట్, పుష్కర రేవులు వరద నీటిలో మునిగాయి. గురువారం మధ్యస్థ లంకలోకి నీరు ప్రవేశించడంతో కూరగాయలు, ఇతర ఉత్పత్తులను రైతులు పడవలపై గట్టుకు చేరుస్తున్నారు. వరద మరింత పెరిగే పశువులను ఏటిగట్టుపైకి తీసురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. శుక్రవారం ఉదయానికి సిద్ధాంతం, కోడేరు, అయోధ్యలంకల్లో ఉధృతి పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. పడవ ప్రయాణాలపై అధికారులు నియంత్రణ విధించారు. వరద భయంతో లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.

యలమంచిలిలో స్థిరంగా..

యలమంచిలి: మండలంలో గోదావరి వరద స్థిరంగా ఉంది. మూడో రోజూ కూడా కనకాయలంక కాజ్‌వే ముంపులోనే ఉంది. దీంతో ఇంజన్ పడవలపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కాజ్‌వేపై మూడడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. రెండు రోజుల పాటు వరద స్థిరంగా ఉంటుందని అధికారిక సమాచారం.

పంటు రాకపోకలు బంద్

నరసాపురంలో వశిష్ట గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా నీరు రావడంతో స్థానికంగా నదిలో నీటిమట్టం పెరిగింది. దీంతో నరసాపురం–సఖినేటిపల్లి మధ్య పంటు రాకపోకలు నిలిపివేశారు. దీంతో చించినాడ బ్రిడ్జి మీదుగా వెళ్లాల్సి వస్తోంది. అయితే చించినాడ బ్రిడ్జి మరమ్మతులతో పూర్తిస్థాయిలో రాకపోకలు సాగడం లేదు. నరసాపురంలోని వలంధర్ రేవులో పిండ ప్రదానం షెడ్డు వరకూ నీరు చేరింది. అధికారులు రేవులో స్నానాలను నిషేధించారు.

సమర్థంగా ఎదుర్కొంటాం: జేసీ

యలమంచిలి: గోదావరి వరదను సమర్థంగా ఎదుర్కొంటామని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కనకాయలంక గ్రామంలో ఆయన పర్యటించి లోతట్టు ప్రాంతాలు, మెడికల్ క్యాంపు, అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ షాపులను పరిశీలించారు. ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యిందని, జిల్లాలోని పెనుగొండ, ఆచంట, యలమంచిలి, నరసాపురం మండలాల్లోని ఏడెనిమిది లంక గ్రామాలపై ప్రభావం ఉంటుందన్నారు. కనకాయలంకలో రాకపోకలకు ఆరు బోట్లు నడుపుతున్నామన్నారు. 50 నుంచి 60 లైఫ్ జాకెట్స్ సిద్ధం చేయమని ఆదేశాలిచ్చామన్నారు. లంక గ్రామాల్లోని మంచం మీద ఉన్న రోగులు, గర్భిణులు, బాలింతలను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. వరద ప్రభావిత గ్రామాల్లోని 34 రేషన్ షాపుల్లో మూడు నెలల రేషన్ సరుకులు నిల్వ ఉంచామన్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో స్కూల్ పిల్లలకు సెలవులు ఇస్తున్నట్టు చెప్పారు. నరసాపురం ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్ కుమార్, ఎలక్ట్రికల్ ఈఈ కె.మధుకుమార్, జిల్లా మత్స్యశాఖాధికారి నాగలింగాచార్యులు, ఎఫ్‌డీఓ ఏడుకొండలు ఉన్నారు.

అనుగృహమెప్పుడో..?

ఇళ్లకు చంద్ర గ్రహణం

- ఒక్క ఇంటికీ మోక్షం లేదు
- సెంటు భూమి పంపిణీ చేయలేదు
- ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు లేవు
- పేదలకు కలగా సొంతింటి నిర్మాణం
- గత ప్రభుత్వంలో 73 వేల మందికి స్వగృహ ప్రాప్తి



గత ప్రభుత్వంలో ఏర్పడిన ఆకివీడు మండలంలో పేదల గృహ సముదాయం

ఆకివీడు: పేదలకు సొంతింటి నిర్మాణం కలగానే మిగలనుంది. కూటమి ప్రభుత్వ 15 నెలల పాలనలో గృహ నిర్మాణాల ఊసెత్తకపోవడం పేదలకు శాపంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇళ్ల నిర్మాణానికి రూ.4 లక్షల చొప్పున సాయం చేస్తామన్న నాయకుల హామీలు అమలుకావడం లేదు. జిల్లాలో ఒక్క ఇంటిని కూడా పేదలకు మంజూరు చేయకపోగా సెంటు స్థలం కూడా సేకరించిన దాఖలాలు లేవు. ఇళ్ల నిర్మాణాలకు వేలాది దరఖాస్తులు ప్రభుత్వ కార్యాలయాల్లో మూలుగుతున్నాయి. ఇళ్లకు సంబంధించి ఆన్‌లైన్ సైట్లు మూసివేయడంతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఆన్‌లైన్‌లో సైట్‌లు తెరవకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అలాగే గత ప్రభుత్వంలో స్థలం మంజూరై ఇంటి నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం బిల్లులను ఇవ్వడం లేదు. దీంతో నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. లబ్ధిదారులు అప్పులతో సతమతమవుతున్నారు. తమకు ఇళ్లను ఇవ్వకపోగా కూటమి ప్రభుత్వం ఉన్న పూరిళ్లను కూలదోస్తుందని పేదలు ఆవేదన చెందుతున్నారు.

గత ప్రభుత్వంలో వేలాదిగా ఇళ్లు : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో 73,392 మందికి ఇళ్ల నిర్మాణాల నిమిత్తం రూ.1.80 లక్షల చొప్పున సాయం, డ్వాక్రా రుణం రూ.30 వేల చొప్పున అందజేశారు. 35,778 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయగా మరో 25 వేల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వంలో ఈ ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు అంతంతమాత్రంగా జమవుతున్నాయి. శ్లాబ్ పనులు పూర్తి చేసినవారికి రూ.1.80 లక్షలు జమ కావాల్సి ఉండగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

సర్వేలతో ఇళ్ల పట్టాలు వెనక్కి

కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీల్లో సర్వేను వేగవంతం చేసింది. నిర్మాణాలు చేపట్టని పేదల ఇంటి స్థలాలను వెనక్కి తీసుకుంటోంది.

కేంద్రం నుంచి ఇళ్ల మంజూరు ఏదీ?

కేంద్ర ప్రభుత్వం నుంచి పేదల ఇళ్ల నిర్మాణం కోసం అధిక మొత్తంగా నిధులు తీసుకురావాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. 2.0 పథకం ద్వారా ఈ ఏడాది జిల్లాకు 595 ఇళ్లు మంజూరు చేసినా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఇళ్లను ఆన్‌లైన్‌లో మాత్రమే చూపిస్తున్నారని పలువురు అంటున్నారు.

పేదల గూడును కూలదోసి.. కూటమి పాలనలో పేదలకు ఇళ్లు నిర్మించుకోకపోగా కాలువ గట్లు, రోడ్డు పక్కన నివసిస్తున్న వారి గుడిసెలను కూలదోస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు పేరుతో పేదల పూరిళ్లను తొలగిస్తున్నారు.

ఒక్క సెంటూ కొనలేదు



కూటమి పాలనలో పేదల కోసం భూసేకరణ చేయలేదు. ఒక్క సెంటు భూమి కొనలేదు. ఒక్క ఇల్లు కట్టలేదు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పించలేదు. ఇంటి నిర్మాణాలపై తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. ఇల్లు నిర్మించుకునే వారికి వెంటనే సాయం చేయాలి. రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలి.

– జేఎన్‌వీ గోపాలన్, సీపీఎం నేత

అప్పులు తప్ప బిల్లుల్లేవు



పేదల ఇళ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఎలాంటి సహకారం అందించడం లేదు. 15 నెలలు గడిచినా పేదలకు ఇంటి నిర్మాణ బిల్లులు వేయడం లేదు. అప్పులతో ఇళ్లు నిర్మించుకుంటున్నారు. పెండింగ్ బిల్లులు వెంటే క్లియర్ చేయాలి. హామీ మేరకు రూ.4 లక్షల సాయం అందించాలి.

– బి.రవివర్మ, పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు, ఆకివీడు

సాయం అందించాలి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో నాకు ఇంటి స్థలం ఇచ్చారు. ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక స్థోమత లేక ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నాం. గతంలోనే ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణం శ్లాబ్ వరకూ పూర్తయినా బిల్లులు రాలేదు. అప్పులు చేసి ముందుకు వెళ్లలేకపోతున్నాం.

– సోమరాజు లక్ష్మి, లబ్ధిదారురాలు, తాళ్లకోడు, ఆకివీడు మండలం

క్లుప్తంగా

అమెరికాలో యువ ఆస్ట్రోనాట్‌గా జాహ్నవి దంగేటి



జాహ్నవిని అభినందిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం : అమెరికాలోని ప్రైవేట్ అంతరిక్ష పరిశోధనా సంస్థ 'టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్' 2029లో నిర్వహించే అంతరిక్ష యాత్రకు ఆస్ట్రోనాట్ కాండిడేట్‌గా పాలకొల్లుకు చెందిన యువతి జాహ్నవి దంగేటి ఎంపికైంది. ఈ సందర్భంగా గురువారం ఢిల్లీ కార్యాలయంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను శాలువాతో సత్కరించి మంత్రి అభినందనలు తెలిపారు. 2022లో పోలాండ్‌లోని క్రాకోవ్‌లో ఉన్న అనలాగ్ ఆస్ట్రోనాట్ ట్రైనింగ్ సెంటర్ లో చిన్న వయసులోనే విదేశీ అనలాగ్ ఆస్ట్రోనాట్‌గా, మొదటి భారతీయ మహిళగా కూడా ఆమె చరిత్ర సృష్టించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన బాలికలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట), ఏలూరు రూరల్ : స్థానిక ఆదివారపు పేట ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య (ఏఆర్‌డీజీకే) నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల విజయనగరం జిల్లా కొండవెలగాడలో జరిగిన అస్మిత్ ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీ. కాంతి జయకుమార్ తెలిపారు. విద్యార్థిని ఎం.పావని 44 కేజీల విభాగంలో బంగారు పతకం, ఎం. దీక్షిత 44 కేజీల విభాగంలో రజత పతకం, సీహెచ్.కీర్తన 58 కేజీల విభాగంలో రజత పతకం, కే.భార్గవి 58 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించారని తెలిపారు. వీరు ఈనెల 23వ తేదీన విశాఖపట్నంలో జరిగే జోనల్ స్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తోట శ్రీనివాస్ కుమార్, అబ్బ దాసరి జోజిబాబు తెలిపారు. విద్యార్థులకు గురువారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు.

వరకట్న వేధింపులపై కేసు

తాడేపల్లిగూడెం రూరల్: అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడంటూ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై జేవీఎస్.ప్రసాద్ తెలిపారు. పెదతాడేపల్లికి చెందిన పుట్టా గోపీ అయ్యప్ప, స్వాతిలకు వివాహం కాగా, కొంతకాలం కాపురం సజావుగా సాగింది. అనంతరం అదనపు కట్నం రూ.10 లక్షలు తీసుకురావాలంటూ శారీరకంగా, మానసికంగా వేధించడంతో పాటు భర్త గోపీ అయ్యప్ప, అతని కుటుంబ సభ్యులు తిట్టి, కొట్టినట్లు బాధితురాలు స్వాతి గురువారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అడవిలో అన్నీ ఔషధాలే

- ప్రతి మొక్కలో ఆరోగ్య గుణాలు
- ఆయుర్వేద వైద్యంలో వినియోగం
- వాటితో స్వల్ప, దీర్ఘకాలిక వ్యాధులు నయం

బుట్టాయగూడెం: ప్రకృతిలో లభించే వస్తువులకు ఒక్కొక్క ప్రాధాన్యత ఉంటుంది. అందంగా కనిపించే మొక్కలు, నోరూరించే పండ్లు, ఇంటికి వినియోగించే కలప ఇలా ఒకటేంటి అన్నీ మనకు ఉపయోగపడేవే. అడవిలో దర్శనమిచ్చే చెట్లు ఆహ్లాదాన్ని పంచడంతో పాటు వివిధ రకాల వ్యాధులను నయం చేస్తాయని ఆయుర్వేద వైద్యులు పేర్కొంటున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో సహజసిద్ధంగా లభిస్తున్న ఔషధ మొక్కలు, చెట్లు ఎన్నో ఆరోగ్య గుణాలను కలిగి ఉంటాయంటున్నారు. పూర్వం మన మహర్షులు మనుషుల్లో వ్యాధులను నివారించే మొక్కలు, వాటి ఔషధ గుణాలను వివరిస్తూ రుగ్వేదంలో పొందుపరిచారు. నేటి ఆధునిక కాలంలో ఎన్నో రకాల యాంటీబయాటిక్‌లు మందులు తయారవుతున్నప్పటికీ వాటికి నయం కాని రోగాలు ఆయుర్వేదం ద్వారా తగ్గించవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో విరివిగా లభించే ఆయుర్వేద మొక్కలు వాటి ప్రత్యేకతలను తెలుసుకుందాం.



రక్తశుద్ధి, నులిపురుగుల నివారణకు ఉపయోగపడే సుగంధ వేరు తీగ



ఔషధ మొక్క పసుపు తంగేడు చెట్టు

రామారావు కాడ



ఇది పూర్తి ఔషధ గుణాలు కలిగిన మొక్క. ఈ మొక్క విరిగిన కాళ్లకు, పుచ్చిపోయిన పళ్లకు, కాలి గాయాల నివారణకు ఉపయోగపడతాయి. ఇది అటవీ ప్రాంతంలో అందరికీ కనిపిస్తుంటుంది. కానీ ఇది ఒక ఔషధ మొక్క అని మనం గ్రహించలేం. ఆయుర్వేద వైద్యులు మాత్రం సమస్య వచ్చినప్పుడు ఆ మొక్కను చూపిస్తే అందరూ ఆశ్చర్యపోతారు.

పులివావిలి



ఏజెన్సీ ప్రాంతంలో మాత్రమే లభించే పులివావిలి చెట్టులో ఆరోగ్య వైద్య గుణాలు ఎక్కువగా ఉన్నాయి. కీళ్ల నొప్పులతో పాటు జ్వరం, శరీరంలో నొప్పులను తగ్గించడంలో ఇది ఉపయోగపడుతుంది. ఆకు దంచి వేడి చేసి నొప్పి ఉన్న చోట రుద్దడం, నీళ్లలో వేసి వేడిచేసి స్నానం చేస్తే నొప్పులు తగ్గుతాయి.

శతావరి



ఆయుర్వేద శాస్త్రంలో శతావరిగా పేరొందిన మొక్కను పిల్లి పీచరగా పిలుస్తారు. ఈ మొక్కకు సన్నటి ఆకులు, ముళ్లు కూడా ఉంటాయి. ఇది తీగ జాతికి చెందిన మొక్క. ఈ మొక్క వేసవిలో సైతం పచ్చగా ఉంటుంది. ఎండాకాలంలో పచ్చగా ఉండేందుకు తన వేళ్లలో కొంతనీటిని దాచుకుంటుంది. అందుకు వేర్లు ఉబ్బి గడ్డలుగా తయారవుతాయి. ఆ గడ్డల్లో ఎన్నో విలువైన ఔషధ గుణాలు ఉన్నాయి. ఒక కంపెనీ శెతవరెక్స్ పేరుతో గ్రాన్యుల్స్ విడుదల చేసిందంటే దీని విలువ అర్థం చేసుకోవచ్చు. బాలింతలకు పాలు రావడానికి, మూత్రంలో ఇన్ఫెక్షన్ తొలగించి సక్రమంగా పనిచేసేందుకు ఈ మొక్క ఉపయోగపడుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

సరస్వతీ ఆకు



సరస్వతీదేవితో పాటు సరస్వతీ ఆకు కూడా పూజ్యనీయమే. ఈ ఆకుకు అంతటి విలువ ఉంది. సరస్వతీ ఆకు మొక్కను చక్కని అలంకరణ మొక్కగా కూడా పెంచుకోవచ్చు. ఇది కేవలం పాకాల బుడుగు ప్రాంతాల్లో మాత్రమే లభిస్తుంది. ఈ ఆకులో ఉండే ఒక రకమైన యాసిడ్ జ్ఞాపక శక్తిని పెంపొందించడంలో, మెదడుకు సంబంధించిన వ్యాధులను నివారించేందుకు పనిచేస్తుంది.

పొత్తి దుంప



పొత్తిదుంప మొక్క సైంటిఫిక్ పేరు గ్లోరియాసిస్ సుపర్బ. ఈ మొక్క కేవలం అటవీ ప్రాంతంలోనే కనిపిస్తుంది. ఐదువేళ్ల ఆకారంలో ఐదు రంగుల్లో ఉంటుంది. దీనిపూత వినాయక చవితికి ముందు పూస్తుంది. ఈ మొక్క విత్తనాల నుంచి తీసే మందు కీళ్ల నొప్పులకు ఎక్కువగా వాడుతుంటారు. ఈ మొక్కకు కింద గడ్డం ఉంటుంది. గిరిజనులు అడవిలోకి వెళ్లినప్పుడు జెర్రి, తాడి జెర్రిలాంటి విషపురుగులు కుడితే మొక్క కింద గడ్డ తీసి గాయంపై పెడితే విష ప్రభావం, మంట, నొప్పి కూడా తగ్గుతుంది. అలాగే పశువుల్లో వచ్చే జబ్బువాపు రోగానికి గడ్డను దంచి పెడితే ఆ వ్యాధి తగ్గుతుంది.

సీతమ్మ జడ గంటలు

ఇది అడవిలో విరివిగా కనిపించే మొక్క. ఈ మొక్క రసం పాముకాటుకు, కాళ్లపై వచ్చే ఇన్ఫెక్షన్‌కు ఉపయోగపడుతుంది. శరీరంపై వచ్చే గడ్డలను కూడా నివారిస్తుంది. ఈ మొక్కలు ఎక్కువగా ఔషధ గుణాలను కలిగి ఉంటాయి.

ప్రతి మొక్కలో ఔషధాలు



అడవుల్లో లభించే ప్రతి మొక్కలో ఔషధాలు ఉన్నాయి. నేను గత 22 ఏళ్లుగా గిరిజన ప్రాంతంలో మూలికా వైద్యం చేస్తూ ఎంతో మందికి ఎన్నో జబ్బులను నయం చేశాను. సుగర్‌కు సంబంధించి 8 రకాల మొక్కలతో తయారు చేసిన ఔషధం ఎంతోమందికి ఉపయోగపడింది. ప్రతి మొక్క ఎంతో ప్రయోజనకరం.

– కుర్సం దుర్గారావు, మూలికా వైద్యుడు, ఎర్రాయిగూడెం, బుట్టాయగూడెం మండలం

చైన్‌స్నాచర్ అరెస్టు



చైన్ స్నాచింగ్ దొంగను అదుపులోకి తీసుకుని వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సైలు

కైకలూరు: వృద్ధురాలి మెడలో 3 కాసుల బంగారు నానుతాడును లాక్కుని పారిపోయిన వ్యక్తిని కైకలూరు టౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పట్టణ సీఐ పి.కృష్ణ, ఎస్సై ఆర్.శ్రీనివాస్‌లు స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 15న వేమవరప్పాడు గ్రామానికి చెందిన బోడావుల గంగామహాలక్ష్మి (70) మెడలో నానుతాడును అదే గ్రామానికి చెందిన బొద్దు మోజెష్ పల్సర్ బైక్‌పై వచ్చి లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం వాహన తనిఖీల్లో భాగంగా నిందితుడు మోజెష్ పారిపోతుండగా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి గొలుసు స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో కృషి చేసిన కైకలూరు టౌన్ ఎస్సై ఆర్.శ్రీనివాస్, కానిస్టేబుళ్లు దుర్గాప్రసాద్, నాగార్జున, రాములకు ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ నగదు ప్రోత్సాహకాలు అందించారు.

భార్య, బిడ్డ అదృశ్యంపై ఫిర్యాదు

ఉండి: భార్య, బిడ్డ అదృశ్యంపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. ఉండి మండలం పాములపర్రు గ్రామానికి చెందిన పాగిరి హరీష్ తన భార్య బిడ్డతో కలసి కొంతకాలంగా కొవ్వూరులో తాపీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 9వ తేదీన రాఖీ పండుగను పురస్కరించుకుని స్వగ్రామానికి కుటుంబ సమేతంగా వచ్చాడు. అనంతరం తాపీ పనులు చేయలేకపోతున్నాని ఇక్కడే ఉండి ఏదో పని చేసుకుని బతుదామని భార్యతో చెప్పగా ఆమె అంగీకరించింది. దీంతో ఈ నెల 18వ తేదీన హరీష్ కొవ్వూరు వెళ్లి సామాన్లు తీసుకుని ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటివద్ద భార్య కరుణ, కుమార్తె లోహిత కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువులు వద్ద వెదికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు.

రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు ప్రారంభం



పోటీల్లో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ రాష్ట్రస్థాయి ఆరోవ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలు గురువారం పెంటపాడు మండలం ప్రత్తిపాడులోని సరస్వతి విద్యాలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా యోగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ తరుపున గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, డైరెక్టర్ రాధిక, రవీంద్రనాథ్, మునిసిపల్ కమిషనర్ యేసుబాబు, ఆరోగ్యశ్రీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ పల్లవి, లయన్స్ క్లబ్ తరుపున గట్టిం మాణిక్యాలరావు, డాక్టర్ కొలనువాడ పెద్ద కృష్ణంరాజు హాజరయ్యారు. పోటీలను యోగా కోచ్ కరిబండి రామకృష్ణ పర్యవేక్షించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన యోగా సభ్యులు కోడ్ ఆఫ్ బుక్ ప్రకారం వివిధ యోగాసనాలు వేశారు. వక్తలు మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం, మానసిక వికాసం, ఉన్నత ఆలోచనలు కలుగుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరు యోగా చేయాలని కోరారు. పోటీల్లో విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో యోగా సభ్యులు అపర్ణప్రసాద్, త్రిమూర్తులు, రాజా, నాగేశ్వరరావు, రాంబాబు, సుజాత, సుభద్ర, లక్ష్మి, యోగా గురువులు, కోచ్‌లు, జడ్జిలు పాల్గొన్నారు.

కాలువ గట్టు కబ్జా



ఉండిలో పాములపర్రు కాలువపై గేటుపెట్టి తాళం వేసిన ఓ రైతు

ఉండిలో కాలువగట్టు ఆక్రమణలకు గురవుతోంది. ఏకంగా కాలువ గట్టుకు గేటు పెట్టి తాళం వేసి మరీ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఉండి సెంటర్‌కు సమీపంలో కొత్తగా నిర్మాణం చేస్తున్న అన్న క్యాంటీన్ వెనుక ఓ రైతు తన చెరువులు, హ్యాచరీకి వెళ్లేందుకు పాములపర్రు పంట కాలువపై గతంలో వంతెన నిర్మాణం చేసుకున్నాడు. అయితే ఏమైందో ఏమో కానీ గణపవరం రోడ్డును ఆనుకుని వంతెనకు గేటు పెట్టి దానికి తాళం వేసేశారు. దీంతో ఆయన చెరువుల క్షేమం సంగతి అటుంచితే పాములపర్రు కాలువ గట్టును పూర్తిస్థాయిలో ఆక్రమించేశారు. దీనిపై అధికారులు దృష్టి సారించి పంటకాలువ గట్టును ఆక్రమణల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

– ఉండి

నేత్రపర్వం.. నారసింహుని శాంతి కల్యాణం

సుందరగిరిపై ముగిసిన దివ్య పవిత్రోత్సవాలు



శాంతి కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాధపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ కనకవల్లి సమేత లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో దివ్య పవిత్రోత్సవాల ముగింపును పురస్కరించుకుని గురువారం విశేష కార్యక్రమాలు జరిగాయి. అందులో భాగంగా స్వామివారి శాంతి కల్యాణం, గరుడ వాహన సేవ, పవిత్రావరోహణ, మహా పూర్ణాహుతి వేడుకలు కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో బంగారు శేష వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి శాంతి కల్యాణాన్ని మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ నేత్రపర్వంగా జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు బంగారు గరుడ వాహనంపై కోవెల ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ సూచనల మేరకు తొలిసారి నిర్వహించిన దివ్య పవిత్రోత్సవాలు స్వామివారి వైభవాన్ని చాటాయి.

గ్రామ సూచిక మాయం



చోరీలకు కాదేదీ అనర్హం అన్నట్టుంది పరిస్థితి. ఊరి పేరు తెలియజేసే బోర్డును సైతం దొంగిలించిన ఘటన ఏలూరు రూరల్ మండలం సోమవరప్పాడు మాదేపల్లిలో చోటుచేసుకుంది. గతంలో గ్రామాన్ని సూచించే గ్రామ సూచిక బోర్డును ఆంజనేయస్వామి గుడి దాటిన తర్వాత ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ సూచిక బోర్డును మాయం చేశారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి ఇది ఏ ఊరో తెలియని పరిస్థితి ఏర్పడింది.

– దెందులూరు

బస్సులు ఢీ.. విద్యార్థులకు గాయాలు



ప్రమాదంలో బస్సు అద్దం ధ్వంసమైన దృశ్యం

కాళ్ల: ఆగి ఉన్న కాలేజీ బస్సును మరో కాలేజీ బస్సు ఢీకొనడంతో రెండు బస్సుల్లో ఉన్న విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం కాళ్లలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం భీమవరంలోని ప్రైవేట్ జూనియర్ కాలేజ్ బస్సు విద్యార్థుల కోసం కాళ్లలో రోడ్డు పక్కన ఆగి ఉండగా, పెన్నాడలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజ్ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాద సమయంలో రెండు బస్సుల్లోనూ కలిపి 60 మంది విద్యార్థుల వరకు ఉన్నారు. ప్రమాదంతో రెండు బస్సుల అద్దాలు ధ్వంసమయ్యాయి. కొందరు విద్యార్థినులకు తీవ్ర గాయాలు కాగా మరికొందరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను ఆటోలో ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ల నియామకంలో కళాశాల యాజమాన్యం సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని బల్లిపాడు గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ జరిగింది. గురువారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బల్లిపాడు గ్రామంలో నివాసం ఉంటున్న బీహెచ్ రాధాకృష్ణ కుమారి ఈనెల 2వ తేదీన హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లింది. గురువారం ఇంటికి రాగా ఇంటికి వేసిన తాళం తెరిచి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే 112కు ఫిర్యాదు చేయగా రూరల్ పోలీసులు వచ్చి పరిశీలన చేశారు. రూ.85 వేలు విలువ గల వెండి వస్తువులు, రూ.10 వేలు నగదు పోయినట్లు బాధితురాలు గుర్తించి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

కొత్త వీసీ ఎవరో?



తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేస్తున్న డాక్టర్ కె.గోపాల్ పదవీ కాలం ఈనెల 31వ తేదీతో ముగియనుంది. కొత్త వీసీ ఎవ్వరనేది ఇంకా స్పష్టం కాలేదు. కొత్త వీసీ నియామకానికి సంబంధించి నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేయలేదు. అధికారికంగా వీసీ నియామకానికి గాను ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వాస్తవానికి వీసీ నియామకానికి గాను సెర్చ్ కమిటీని ఏర్పాటుచేయాలి. వారు పరిశీలించిన దరఖాస్తుల్లో మూడు పేర్లను గవర్నర్‌కు పంపించాలి. ఆయన ఒకరి పేరును ప్రభుత్వానికి పంపించిన తరువాత వీసీని ప్రకటించాలి. కానీ ఇలాంటి తంతు ఏమీ లేకుండానే వీసీ నియామకానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్టుగా కనిపిస్తోంది.

ఆశావహుల ప్రయత్నాలు

ప్రస్తుత వీసీ కె.గోపాల్ ప్రయత్నాలు చేస్తున్నట్టుగా విశ్వసనీయ సమాచారం. వాస్తవానికి ఈ పోస్టు కోసం గతంలో వర్సిటీలో అధికారులుగా పనిచేసిన దిలీప్‌బాబు, బి.శ్రీనివాసులు తదితరులు రేసులో ఉన్నట్టు తెలుస్తోంది.

12 ఏళ్లుగా ఇన్‌చార్జిలే గతి

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) నుంచి 2007 నుంచి ఎస్‌డీ. శిఖామణి, బీఎంసీ.రెడ్డి, తోలేటి జానకీరామ్ రెగ్యులర్ వీసీలుగా వచ్చి పనిచేశారు. ఆ తరువాత నుంచి 12 ఏళ్లుగా ఇన్‌చార్జి అధికారులనే నియమిస్తున్నారు. మరోసారి ఇన్‌చార్జి వీసీగా ఎవ్వరినైనా నియమిస్తారా లేదంటే ప్రస్తుత వీసీనే కొనసాగిస్తారా అనేది చర్చనీయాంశంగా ఉంది.

డ్రైవర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): షెడ్యూల్డు కులాలకు చెందిన యువతకు హెవీమోటార్ వెహికల్ (హెచ్ఎంవీ) డ్రైవరు శిక్షణను ఎస్సీ కార్పొరేషన్ సౌజన్యంతో ఏపీపీటీడీ (ఏపీఎస్ఆర్టీసీ) వారి సారథ్యంలో అందిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.ముక్కంటి గురువారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు లైటు మోటార్ వెహికల్ (ఎల్ఎంవీ) లైసెన్స్ పొంది కనీసం ఏడాది అయ్యి ఉండాలని, హెవీ డ్రైవింగ్ లెర్నర్ లైసెన్స్ (ఎల్ఎల్ఆర్) కూడా ఉండాలన్నారు. శిక్షణ నాన్-రెసిడెన్షియల్, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్ (ఏపీఎస్ఆర్టీసీ) డ్రైవింగు శిక్షణ పాఠశాలలో జరుగుతుందని తెలిపారు. శిక్షణ కాలం 40 రోజులు ఉంటుందన్నారు. దరఖాస్తులను ఈనెల 27వ తేదీ సాయంత్రంలోగా ఎస్సీ కార్పొరేషన్, ఏలూరు కార్యాలయమునందు స్వయముగా అందజేయాలన్నారు. వివరాలకు సెల్ 80196 84966 నంబరులో సంప్రదించాలని కోరారు.

కనుమరుగవుతున్న కాలువ గట్టు

- గట్టు తవ్వి సొమ్ము చేసుకుంటున్న వైనం
- కోతకు గురవుతున్న గట్లు
- రైతులకు శాపంగా మారుతున్న ఆక్రమణలు
- పట్టించుకోని అధికారులు


జగ్గన్నపేట సమీపంలో తవ్వేసిన తాడిపూడి కాలువ గట్టు


తవ్విన కంకరను తరలిస్తున్న లారీ

తాడేపల్లిగూడెం రూరల్: రైతులకు రెండో పంటకు నీరందించడానికి ఎంతో సదాశయంతో తాడిపూడి కాలువ నిర్మించారు. తాడేపల్లిగూడెం మండలంలో వీరంపాలెం నుంచి వెంకట్రామన్నగూడెం వరకు తాడిపూడి కాలువ సరిహద్దు ఉంది. కాలువ ఆనుకుని తాడి చెట్టు ఎత్తున గట్లను ఏర్పాటు చేశారు. గట్టు ఏర్పాటుకు గాను రైతుల నుంచి భూసేకరణ చేసి, మార్కెట్ విలువ ఆధారంగా సొమ్ములను సైతం చెల్లించారు. గట్టు ఏర్పాటులోనూ ఎంతో లోతైన ఆశయం ఉందని తెలుస్తోంది. భవిష్యత్‌లో తాడిపూడి కాలువ ఉధృతంగా ప్రవహించే సమయంలో కాలువ నీరు సరిహద్దు పొలాలను ముంచెత్తకుండా ఈ గట్లు గోడలా నిలవనున్నాయి. అయితే ఈ గట్లను అధికారంలో ఉన్న నాయకులే తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. దీంతో కాలువ గట్లు కనుమరుగైపోతున్నాయి.

ఆక్రమణలకు తెర లేపిన సరిహద్దుదారులు

గట్లను తవ్వి కంకర, మట్టిని విక్రయించుకోవడంతో గట్టు ఏర్పాటుకు భూములిచ్చిన సరిహద్దు రైతులే వాటిని ఆక్రమించుకునే పరిస్థితి తలెత్తింది. ఇప్పటికే చాలా మంది సరిహద్దు రైతులు ఇలా ఆక్రమించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం జగ్గన్నపేట సమీపంలో తాడిపూడి కాలువ గట్టును తవ్వేసి కంకరను లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రైతుల అత్యాశ భవిష్యత్‌లో శాపంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. గట్టు ఆక్రమణ ప్రాంతాల్లో అధికారులు నోటీసు బోర్డులు ఏర్పాటు చేసినా వాటిని తొలగించి మరీ యథేచ్ఛగా మట్టిని తవ్విన సందర్భాలు ఉన్నాయి. మరో పక్క వర్షపు నీటి ప్రవాహానికి కాలువ కోతకు గురవుతుంది. దీంతో మట్టి అంతా కాలువలోకి చేరుకుని పూడుకుపోయే పరిస్థితి నెలకొంటుంది. కాలువ గట్లను పర్యవేక్షించవలసిన సంబంధిత శాఖ అధికారులు మిన్నకుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కాలువ గట్లను పునరుద్ధరించాలి



రైతాంగం శ్రేయస్సు కోసం నిర్మించిన తాడిపూడి కాలువకు పూర్వ వైభవం తీసుకురావాలి. అలాగే, తవ్వేసి గట్లను పునరుద్ధరించాలి. తద్వారా సరిహద్దు రైతాంగానికి మేలు చేకూరుతుంది. రెండు, మూడు పంటలకు కాలువలోని నీరు అందించడంతో పాటు అధిక దిగుబడులు సాధించొచ్చు. ఇప్పటికైనా, అధికారులు స్పందించి గట్ల పటిష్టానికి చర్యలు తీసుకోవాలి.
– నీలపాల కృష్ణారావు, వెంకట్రామన్నగూడెం, తాడేపల్లిగూడెం మండలం

ఉచిత ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్


రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెంటపాడు మండలం అలంపురం శ్రీవెంకటరమణ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఆసుపత్రిని గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న చికిత్సలను, సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పలు విభాగాలను, వైద్య పరికరాలను పరిశీలించారు. రోగులకు పళ్లు పంపిణీ చేశారు. దివ్యాంగులు ప్రేమతో అందించిన గులాబీ పువ్వులను కలెక్టర్ తీసుకున్నారు. ట్రస్ట్ నూతన ఆసుపత్రి నిర్మాణానికి కొనుగోలు చేసిన 4 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఆసుపత్రిని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ట్రస్ట్‌ను ఆదర్శంగా తీసుకొని సేవలను అందించాలని ఆయా సంస్థలకు విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రి నిర్వాహకులు కొలనువాడ పెద్ద కృష్ణంరాజు, కేవీ రాజు, ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ భానో, తహసీల్దార్ టి.రాజేశ్వరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాసవీమాత వెండి విగ్రహం ఆవిష్కరణ


వాసవీ మాత వెండి విగ్రహం

తణుకు అర్బన్: శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ప్రార్థనా మందిరంలో వేంచేసియున్న వాసవీ మాతకు దాతల విరాళాలతో చేయించిన అమ్మవారి వెండి విగ్రహాన్ని ఆలయంలో ఆవిష్కరించినట్లు ఆలయ అధ్యక్షుడు గమిని రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం నుంచి వాసవీ మాత వెండి విగ్రహానికి ఆలయ అర్చకులు సంప్రోక్షణ పూజాధికాలు నిర్వహించారు. లోక కల్యాణార్థం రూపొందించిన విగ్రహాన్ని విశేషాలంకరణలో ఏర్పాటు చేయడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి వాసవీ మాతను దర్శించుకున్నారు.

మూల్యాంకన పుస్తకాల విధానం మార్చాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మూల్యాంకన పుస్తకాల విధానం మార్చాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం వారు మాట్లాడుతూ పాఠశాలలో పరీక్షల నిర్వహణలో మూల్యాంకన పుస్తకాలు విద్యార్థులకు సరఫరా చేయడం వలన అనేక సమస్యలు వస్తాయని తెలిపారు. పాఠశాల పని వేళల్లో జరగాల్సిన బోధనా సమయాన్ని హరించే విధంగా ఉందన్నారు. గతంలో పరీక్ష పేపర్లు ఇంటి వద్ద దిద్దే పద్ధతికి బదులు పాఠశాలలో పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లలేని పరిస్థితి ఉపాధ్యాయులకు ఏర్పడిందని, వందలాది పుస్తకాలను ఎలా మోసుకెళతారన్నారు. మార్కులు నమోదు కూడా పనిభారంగా ఉందని, ఇప్పటికే ఆన్‌లైన్ నమోదు, రిజిస్టర్ నమోదు, బబ్లింగ్ చేసే విధానంతో మంచి ఫలితాలు రావన్నారు. కొత్త విధానం నుంచి వైదొలగాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం, ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ పాల్గొన్నారు.

ఒకేషనల్ తరగతుల పరిశీలన


తరగతుల నిర్వహణను పరిశీలిస్తున్న కమ్యూనిటీ మొబైల్ ఆఫీసర్ చంద్రశేఖర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఒకేషనల్ శిక్షణ తరగతులను గురువారం సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబైల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పరిశీలించారు. ఎంఈఓ జ్యోతి హాజరయ్యారు. శిక్షణా తరగతులను, ల్యాబ్‌ను, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఒకేషనల్ శిక్షణ ఉపాధ్యాయులు సురేష్, మాధవి, ఇన్‌చార్జి హెచ్ఎం రవి కుమార్, సీఆర్పీ నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు


మాట్లాడుతున్న సైకాలజిస్ట్ గంగాధర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని అన్ని రకాల వ్యసనాలకు దూరంగా ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ, ధీరా కమ్యూనిటీ బేసిడ్ పీర్‌లెడ్ ఇంటర్‌వెన్షన్ ఆధ్వర్యంలో అల్లంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. సైకాలజిస్ట్ గంగాధర్ మాట్లాడుతూ నా భవిష్యత్తు, నా బాధ్యత అన్న భావనలో విద్యార్థులు తమ జీవితాలను చక్కదిద్దుకోవాలని చెప్పారు. మానసిక ఒత్తిడి జయించాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని పలు సూచనలు చేశారు. పాఠశాల హెచ్ఎం టి.శారద, టి.నవీన్, వై.కృష్ణవేణి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడపిల్లల చదువు భవితకు వెలుగు


మాట్లాడుతున్న సీడీపీవో సరస్వతి

తాడేపల్లిగూడెం రూరల్: ఆడపిల్లల చదువు భవితకు వెలుగు వంటిదని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి టీఎల్ సరస్వతి అన్నారు. గురువారం మండలంలోని ఎల్.అగ్రహారం అంగన్వాడీ కేంద్రంలో పీసీపీఎన్డీ యాక్ట్–2013, పీఎంఎంవీవైపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సరస్వతి మాట్లాడుతూ గర్భస్థ దశలో లింగ నిర్ధారణ చేసి, ఆడ శిశువులను చిదిమేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లల్ని పుట్టనివ్వాలని, ఎదగనివ్వాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, అంగన్వాడీ, ఆశా, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



తణుకు అర్బన్: నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీలు


తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవహారం నిర్వహించిన అంగన్‌వాడీలు

తణుకు అర్బన్: అంగన్‌వాడీలకు సమ్మె కాలపు ఒప్పందాలు, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, జిల్లా శ్రామిక నాయకురాలు అడ్డగర్ల అజయ కుమారి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వెంకటేశ్వర థియేటర్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు ఎలాంటి నిబంధనలు లేకుండా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గుబ్బల గోపి, బళ్ల చిన వీరభద్రం, కామన మునిస్వామి, ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు బొక్కా వసంత కుమారి, మెరిపో మధు షీలా, కనుమళ్ల నళిని రాణి, మొగలపు జ్యోతి, బందెల మాదవి, నాయుడు కనక దుర్గ, వనచార్ల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల మానవహారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని, సమ్మె కాలపు హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట గురువారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా ఉపాధ్యక్షులు దీన స్వరూప రాణి, సీఐటీయూ పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, జిల్లా నాయకులు కండెల్లి సోమరాజు, పర్సన్న, వరలక్ష్మి, గాయత్రి, వీరమ్మ, సీత, సుమలత, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఇరగవరం: తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల శారీల్లో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

నల్ల శారీలతో నిరసన

ఇరగవరం: అంగన్‌వాడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నల్ల శారీలతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఇరగవరం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు అడ్డగర్ల అజయ్‌కుమారి మాట్లాడుతూ అంగవాడి కార్యకర్తల చేత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెట్టి చాకిరి చేయించుకుంటున్నారన్నారు. యాప్‌ల పేరుతో మానసికంగా కార్మికులను వేధిస్తున్నారని అన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కామన మునిస్వామి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు డి.అమరావతి సీహెచ్ చిన్నముసలమ్మ జుత్తిగా సత్యదేవి కె.నాగలక్ష్మి, టి.ప్రభావతి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరు బార్లకు దరఖాస్తుల ఆహ్వానం


నూతన బార్ పాలసీపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నూతన బార్ పాలసీ మూడు సంవత్సరాలకు లైసెన్స్ పొందుటకు గాను మున్సిపాలిటీలో ఆరు బార్లను కేటాయించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి వెల్లడించారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో గురువారం నూతన బార్ పాలసీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎక్సైజ్ ఏసీ, డీసీలు హాజయ్యారు. ఆమె మాట్లాడుతూ జనరల్ కేటగిరిలో 5 బార్లకు నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజ్ రూ.5 లక్షలు, అప్లికేషన్ రుసుము రూ.10 వేలు చెల్లించాలన్నారు. లైసెన్స్ ఫీజు మొదటి ఏడాదికి రూ.55 లక్షలు చెల్లించాలని, ఏడాదికి పది శాతం పెంచి మరో రెండేళ్ల ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుల లాటరీ ప్రక్రియ వ్యవహారంలో ఈ నెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు, 28వ తేదీ బార్లను ఎంపిక చేస్తారని తెలిపారు. బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ ఎంపిక జరుగుతుందని చెప్పారు. అదే విధంగా గీత కులాలకు సంబంధించిన శెట్టి బలిజ కులానికి ఒక బార్ కేటాయించినట్లు, అప్లికేషన్‌కు రూ.5 లక్షలు, నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు రూ.10 వేలు అప్లికేషన్ రుసుము చెల్లించాలన్నారు. మొదటి ఏడాది రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూ.27,50,000 చెల్లించాలని తెలిపారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటలకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 30వ తేదీన బార్‌ను ఎంపిక చేస్తారని చెప్పారు. బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే గాని లాటరీకి ఎంపిక కాదన్నారు. బార్లు పని వేళలు ప్రస్తుత పాలసీలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు పొడిగించారని మరిన్ని వివరాలకు ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించాలని వివరించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తామని విద్యాశాఖ మంత్రి లోకేష్ మాట ఇచ్చారని, ఇచ్చిన హామీలు గాలి మాటలేనని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. టి.ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న ఆయా సమస్యలను పరిష్కరించాలన్నారు. పట్టణంలోని పీజీ సెంటర్‌లో అన్ని రకాల పీజీ కోర్సులు ప్రవేశపెట్టాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని, కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో జరుగుతున్న వ్యాపారాన్ని అడ్డుకోవాలన్నారు. తల్లికి వందనం పథకం 40 శాతం విద్యార్థులకు ఇంకా జమ కాలేదని విమర్శించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఉపకార వేతనాలు రూ.6,400 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, విద్యాశాఖ మంత్రి నోరుమెదపడం లేదని, తక్షణమే ఆయా సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ కాశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. పట్టణ కార్యదర్శి పతివాడ నాగేంద్రబాబు, సభ్యులు మణి, గణేష్, కేశవ, భాను, దుర్గేష్, గౌతమ్ పాల్గొన్నారు.

పురుగు మందులు విచ్చలవిడిగా వాడొద్దు


కార్యక్రమంలో పాల్గొన్న తణుకు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు నరేంద్ర

తణుకు అర్బన్: తణుకు మండలంలోని కొమరవరం గ్రామంలో చిట్టిబాబు వ్యవసాయ క్షేత్రం వద్ద మండల వ్యవసాయ అధికారి కె.రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఇండిజీనియస్ గ్యాప్ సర్టిఫికేషన్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ పొలంబడి కార్యక్రమానికి హాజరైన తణుకు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు జి.నరేంద్ర రైతు క్షేత్రంలో పైరు తొలిదశలో పురుగుల వలన గాని, తెగుళ్ల వలన గాని ఏదైనా నష్టం వాటిల్లినప్పుడు పురుగు మందులు, తెగులు మందులను విచ్చలవిడిగా పిచికారీ చేయొద్దన్నారు. పంట ఏ విధంగా పునరుత్పత్తి చేయవచ్చనే విధానాన్ని రైతులకు ప్రయోగాత్మకంగా చూపించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నాచురల్ ఫార్మింగ్ సిబ్బంది రైతులకు కోడిగుడ్డు నిమ్మరసంతో ఏమినో ఆసిడ్ తయారు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో వీఏఏ జీవీ సత్యసాయి, వెటర్నరీ అసిస్టెంట్ జి.లక్ష్మి, హైందవి, ఎఫ్‌పీఓ గ్రూపు సభ్యులు ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది లక్ష్మి, రామకృష్ణ, రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ చైర్మన్‌ను నియమించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రెడ్డి కార్పొరేషన్ చైర్మన్‌ను నియమించాలని కమ్యూనిటీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం 2021లో రెడ్డి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందన్నారు. కార్పొరేషన్ ప్రధాన ఉద్దేశ్యం పేద రెడ్డి కుటుంబాలకు విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి సహకరించడమేనన్నారు. రెడ్డి సమాజం రాష్ట్రంలో 10 శాతం పైగా ఉన్నారని తెలిపారు. కార్పొరేషన్ ఏర్పడినా చైర్మన్ లేరన్నారు. రెడ్డి కులస్తులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ జాతీయ కన్వీనర్ పల్లపురెడ్డి వెంగళరెడ్డి, నాయకులు నల్లమిల్లి విజయ ఆనందరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కర్రి శ్రీనివాస్‌రెడ్డి, పోతంశెట్టి లక్ష్మి, కర్రి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఎస్సై ఐ.వీర్రాజు కొమరాడలో పేకాట శిబిరంపై సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.17,140 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలి


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలో మంగరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వినతి పత్రాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ పరిపాలన చేస్తున్న పార్టీలు ఎస్సీల మధ్య చిచ్చు పెట్టారని వాపోయారు. ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ రాజ్యాంగం వ్యతిరేకమన్నారు. మాలల హక్కుల కోసం ఉద్యమించాలని, ఈ నెల 25వ తేదీన భీమవరంలో ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. సీహెచ్ జైపాల్, ఎం.నాగేశ్వరరావు, ప్రీబాబు, చిట్టిబాబు, అచ్చిబాబు, రమణ, గోపి, కిరణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తణుకు అర్బన్: తణుకు సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో లైన్ల మరమ్మతులు, నిర్వహణలో భాగంగా శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి తెలిపారు. తణుకు పట్టణంలోని వేల్పూరు రోడ్డు, భాష్యం స్కూలు, నరేంద్ర సెంటర్‌తో పాటు అన్ని ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. ఇరగవరం మండలం కంతేరు, కత్తవపాడు, పొదలాడ, కాకిలేరు గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, అత్తిలి మండలంలో కొమ్మర, మంచిలితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం వన్ టౌన్‌లో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): వన్ టౌన్ నార్త్‌లోని అన్ని సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఈ నెల 22వ తేదీ శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. హౌసింగ్‌బోర్డు, కొండయ్య చెరువు, పాతూరు సబ్ స్టేషన్లు పరిధిలో అన్ని ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఆయన తెలిపారు.

టూ టౌన్ సౌత్ యాగర్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలో...

కె.పెంటపాడు న్యూ సబ్ స్టేషన్ ఏబీ స్విచ్‌లు ఎరక్షన్ వర్క్ నిమిత్తం టూ టౌన్‌లోని యాగరపల్లిలోని సబ్‌స్టేషన్ పరిధిలో నాలుగు ఫీడర్లకు సంబంధించి శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈ నరసింహమూర్తి వెల్లడించారు. పడాల, పడాల గరువు, ముత్యాలంబాపురం, యాగర్లపల్లి, కొబ్బరితోట, జట్లపాలెం ఏరియాలలో విద్యుత్ ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ నిలిపివేత

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి సెక్షన్‌లో లైన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ ఈఈ కె.నరసింహమూర్తి తెలిపారు. కుంచనపల్లి, మోదుగ గుంట, కొండ్రుప్రోలు, టిడ్కో గృహ సముదాయం, ఎల్.అగ్రహారం, మెట్ట ఉప్పరగూడెం, అప్పారావుపేట, గొల్లగూడెం, వెంకట్రావుపాలెం, వెంకట్రామన్నగూడెం, పట్టింపాలెం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో జరిగిన ఓ ప్రమాదం నుంచి ఓ యువతి తృటిలో తప్పించుకుంది. గురువారం సుబ్బారాయుడు గుడి సెంటర్ నుంచి బుధవారపు వీధికి వెళ్లే మార్గ మధ్యలో ఉన్న కరణాల వీధిలో ఓ ప్రైవేటు ట్యూషన్ సెంటర్ ఉంది. ట్యూషన్ సెంటర్ వదిలిన అనంతరం విద్యార్థినులు తమ సైకిళ్లను తీసుకుని ఇంటికి వెళ్తున్నారు. ఇంతలో ఒక అమ్మాయి తన స్నేహితురాలి కోసం రోడ్డుపై నిలబడి ఉండగా వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఆ అమ్మాయి పట్టుకున్న సైకిల్ పూర్తిగా దెబ్బతింది.

అంతర్గత రహదారులు అధ్వానం

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


భారీ గోతులతో అధ్వానంగా ఉన్న రహదారి


బురదమయంగా ఉన్న కాళ్ల లంక రహదారి

కాళ్ల: మండలంలో రాష్ట్ర రహదారితో పాటు అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కొద్దిపాటి వర్షాలకే నీరు నిలబడి ప్రయాణం కష్టంగా మారుతుంది. కొన్ని రహదారులు భారీ గోతుల ఏర్పడడం తో వర్షపు నీరు నిలబడి చెరువులను తలపిస్తున్నాయి. ప్రధానంగా మండలంలో శివారు గ్రామాలైన పల్లెపాలెం నుండి ఎస్సీ బోస్ కాలనీ గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి గోతులు ఏర్పడి ఛిద్రంగా మారింది. ఆక్వా చెరువులు విస్తరించడంతో నిత్యం భారీ వాహనాలు తిరుగుతూ ఉంటాయి. దీంతో రహదారులు అధ్వానంగా మారాయి. ఆ రహదారి వెంట ప్రయాణం అంటేనే ప్రయాణికులు, స్థానికులు భయపడుతున్నారు. గోతుల వల్ల వాహనాలు రిపేర్లకు వస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి రహదారిని కనీసం మరమ్మత్తులను చేయాలని కోరుతున్నారు.

ప్రతి రోడ్డూ గోతులమయమే

మండలకేంద్రమైన కాళ్ల నుండి లంక రోడ్డు, అదేవిధంగా కోలనపల్లి మీదుగా ఆకివీడు వెళ్లే రహదారి గోతులమయమైంది. కోలన్నపల్లి రహదారి కొంతమేర మరమ్మతులు చేసినప్పటికీ మిగిలిన కొంత భాగాన్ని వదిలేయడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో కొద్దిపాటి వర్షానికి భారీ గోతుల్లో వర్షపు నీరు నిలబడి చెరువులను తలపిస్తున్నాయి. గోతులు ఎక్కడ ఉన్నాయో తెలియక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గోతుల్లో పడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. అంతేకాకుండా కాళ్ల లంక రోడ్డు గోతులతో బురదమయంగా మారింది. లంక రోడ్లో జగనన్న కాలనీ, ఆక్వా చెరువులు విస్తరించి ఉన్నాయి. నిత్యం ప్రయాణికులు, వాహనదారులు రైతులు ఆ రహదారి వెంటే వెళ్తుంటారు. ఈ రహదారుల ప్రయాణం జారుడుబల్ల మాదిరిగా మారిందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీకి వెళ్లాలంటే ఇబ్బందులుపడాల్సి వస్తుందని కాలనీవాసులు చెబుతున్నారు. వర్షాకాలం కావడంతో మరింత ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. అంతేకాకుండా కోపల్లె నుంచి వేంపాడు మీదుగా భీమవరం వెళ్లే రహదారి కూడా మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి గోతులమయమైన రహదారులను నిర్మించాలని కోరుతున్నారు.